క్లుప్తంగా

డీ పీఆర్టీయూ రాష్ట్ర మహిళా కార్యదర్శిగా అనురాధ



గంపలగూడెం: డీ పీఆర్టీయూ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా గంపలగూడెం మండలం సత్యాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ నండూరి అనురాధ నియమితులయ్యారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన డీ పీఆర్టీయూ ఎన్టీఆర్ జిల్లా సమావేశంలో ఈ విషయమై రాష్ట్ర అధ్యక్షులు డి. శ్రీను ఆమెకు నియామక పత్రం అందజేశారు. తన పదవీకాలంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. అనురాధ నియామకంపై మండలంలోని పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు



తిరువూరు: స్థానిక జగన్నాథపురంలోని పాటి మీద దాసాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి పలువురు దాతలు ఆదివారం విరాళాలు అందజేశారు. ఆర్యవైశ్య ప్రముఖులు సంకా వెంకటేశ్వరరావు రూ.25,116, దస్తావేజు లేఖరి దేవభక్తుని వీరభద్రరావు రూ.10,116, న్యాయవాది దారా మాధవరావు రూ.11,202, సూరిశెట్టి నాగేశ్వరరావు రూ.10,116 విరాళాలను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబుకు అందజేశారు.

విస్తృతంగా లయన్స్ క్లబ్స్ సేవా కార్యక్రమాలు



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): లయన్స్ క్లబ్స్ సేవా కార్యక్రమాలను మరింతగా విస్తృతంగా చేసి ఎక్కువ మందికి సేవ చేసేందుకు ప్రయత్నిస్తానని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్‌గా ఎన్నికైన గద్దె శేషగిరి అన్నారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్‌లోని ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్(అమ్మ) హాలులో ఆదివారం సాయంత్రం లయన్స్ క్లబ్ జిల్లా ప్రీ-క్యాబినెట్ మీటింగ్ జరిగింది. గద్దె శేషగిరి మాట్లాడుతూ.. క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు, మెడికల్ క్యాంపులు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, మొక్కలు నాటడం, పేదలకు సహాయ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ అవగాహన ర్యాలీలను క్లబ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని చెప్పారు. తోటి వారికి సేవ చేయడంలోనే నిజమైన ఆనందం దాగి ఉంటుందన్నారు. ఇప్పటికే లయన్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో చాలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వాటిని మరింత ఎక్కువ మందికి చేరేలా చూస్తామని ఆయన చెప్పారు. సమాజ సేవలో లయన్స్ క్లబ్ సభ్యులు ఎల్లప్పుడు ముందుంటారన్నారు. ఈ నెలాఖరుకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జరగనున్న 106వ లయన్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న గద్దె శేషగిరి, గద్దె విజయలక్ష్మిని క్లబ్ సభ్యులు అభినందించారు. క్లబ్ సభ్యులు శంకర గుప్తా, మిరియాల వెంకటేశ్వరరావు, సుంకర కృష్ణ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి లయన్స్ సభ్యులు హాజరై లయన్స్ జిల్లా నూతన గవర్నర్‌గా ఎన్నికైన గద్దె శేషగిరి దంపతులను సత్కరించారు.

ప్రమాదకరంగా కల్వర్టులు



నూజివీడు ఊటవాగుపై రెయిలింగ్స్ లేని వంతెన



నూగొండపల్లి వద్ద వంతెనపై ప్రమాదకరంగా ప్రవహిస్తున్న కుంపిణి వాగు (ఫైల్)

- లో లెవెల్ కాజ్‌వేలదీ అదే పరిస్థితి
- రెయిలింగ్ లేకపోవడంతో పొంచి ఉన్న ప్రమాదాలు
- గతంలో వాగుల్లో వ్యక్తులు కొట్టుకుపోయిన ఘటనలు
- రెయిలింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని ప్రజల వినతి

నూజివీడు: నియోజకవర్గంలోని పలు మండలాల్లోని వాగులపై ఉన్న కల్వర్టులు, లో లెవెల్ కాజ్‌వేలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం వచ్చిన నేపథ్యంలో భారీ వర్షాలకు వాగులు పొంగిపొర్లడమే కాకుండా రోడ్లపైకి కూడా పెద్ద ఎత్తున వరదనీరు వచ్చే అవకాశం ఉన్నందున ధ్వంసమైన కల్వర్టులు, కాజ్‌వేల వద్ద మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది. వీటికి ప్రధానంగా రెయిలింగ్స్ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నూజివీడు మండలంలో రామిలేరు వాగు ప్రవహిస్తున్నందున వర్షాకాలంలోను, తుపాన్ల సమయంలోనూ వరదనీరు పెద్దఎత్తున వస్తుంది. దీంతో ఈ వాగుపై ఉన్న రోడ్లపైకి పెద్దఎత్తున వరదనీరు ప్రవహించి రాకపోకలు సైతం స్తంభించిపోతాయి. రామిలేరుపై ఉన్న కల్వర్టులు, కాజ్‌వేలకు మరమ్మతులు చేయించాల్సి ఉంది. పోతురెడ్డిపల్లి రోడ్డులో నూజివీడు పట్టణ పరిధిలోని ఊటవాగుపై ఉన్న కల్వర్టుకు గతంలోనే భారీ రంధ్రం పడగా తాత్కాలికంగా పూడ్చారు. అలాగే జంగంగూడెం, తుక్కులూరు, దేవరగుంటల వద్ద ఉన్న వంతెనలు కొంతమేరకు దెబ్బతిని అధ్వానంగా ఉన్నాయి. వీటికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఆగిరిపల్లి మండలంలో నూగొండపల్లి వద్ద ప్రవహించే కుంపిణీ వాగుపై ఉన్న వంతెనకు రెయిలింగ్స్ లేక ప్రమాదకరంగా ఉంది. ఈ వాగుకు వరద ఎక్కువగా వస్తుంది. రెయిలింగ్స్ లేకపోవడంతో పట్టుకోవడానికి ఏ విధమైన ఆధారం ఉండదు. ఈ వంతెనపై గతంలో రెండుసార్లు మనుషులు కొట్టుకుపోయిన ఘటనలు చోటుచేసుకున్నాయి. తోటపల్లి - చిన్నాగిరిపల్లి మధ్య ఉన్న లోలెవెల్ కాజ్‌వే సైతం ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ కూడా గతంలో వరద వచ్చినప్పుడు వ్యక్తి గల్లంతై మృతదేహం కూడా దొరకలేదు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో ప్రమాదకరంగా ఉన్న లోలెవల్ కాజ్‌వేలు, చప్టాలు, కల్వర్టులకు మరమ్మతులు చేయించి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

కిక్కిరిసిన తిరుపతమ్మ ఆలయం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలోని తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతోపాటు శుభకార్యాలు ఉండటం, పాఠశాలలు, కళాశాలలు ఇంకా పూర్తి స్థాయిలో ప్రారంభంకాకపోవటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ క్యూ లైన్లు కిక్కిరిసిపోయాయి. భారీగా తరలివచ్చిన భక్తులతో పెనుగంచిప్రోలు జనసంద్రమైంది. వేకువజాము నుంచే భక్తులు పాలు,పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తుల వాహనాలతో రద్దీ ఏర్పడి ట్రాఫిక్ ఇక్కట్లు తప్పలేదు. మధ్యాహ్న సమయంలో భక్తులు మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.



అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

వరుణ దేవా.. కరుణ చూపవా

వర్షాల కోసం రైతన్నల ఎదురుచూపులు



వరుణుడి కటాక్షం కోసం ఆశగా ఆకాశం వైపు చూస్తున్న రైతు

నందిగామ: నందిగామ ప్రాంతంలో ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులు రైతుల్లో గుబులు రేపుతోంది. జూన్ మాసం మూడోవారంలోకి ప్రవేశించినా, అదను దక్కకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రుతుపవనాల రాక రోజురోజుకు ఆలస్యమవుతుండటంతో సాగు కాలం దాటిపోతుందన్న భయం వారిని వెంటాడుతోంది. సాధారణంగా ఈపాటికే వాతావరణం చల్లబడాల్సి ఉంది. అయితే ఈ ఏడాది అందుకు భిన్నంగా సూర్య ప్రతాపం కొనసాగుతోంది. జూన్ నెలలో సైతం ఎండలు మే నెలను తలపిస్తున్నాయి. దీంతో సాగుకు అనువైన పరిస్థితుల కోసం అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ ఆలస్యమైతే, రెండో పంట సాగు మరింత ఆలస్యమవుతుందన్న ఆందోళన రైతుల మాటల్లో వ్యక్తమవుతోంది. వర్షాలు ఎప్పుడు కురుస్తాయో తెలియక రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సాగు విస్తీర్ణం 34,483 హెక్టార్లు..

నందిగామ నియోజకవర్గంలో మొత్తం 34,483 హెక్టార్ల సాగు భూమి ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

గతేడాది 13,469 హెక్టార్లలో పత్తి, 5,866 హెక్టార్లలో వరి, 3,585 హెక్టార్లలో మిర్చి పంటను రైతులు సాగుచేశారు. మిగిలిన విస్తీర్ణంలో మొక్కజొన్న, పసుపు, కందులు, కాయగూరలు, ఆకు కూరలు సాగు చేశారు. ఈ ఏడాది కూడా సాగు విస్తీర్ణం గతేడాదిస్థాయిలోనే ఉండవచ్చునని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే విత్తనాలను సైతం కొనుగోలు చేసి సిద్ధంగా ఉన్నారు. పత్తిసాగుకు సన్నాహాలు చేసుకుంటూ రైతులు, వర్షాల కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.

పెనుగంచిప్రోలులో ట్రాఫిక్ కష్టాలు



నాలుగురోడ్ల కూడలి పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో ట్రాఫిక్ పరిస్థితి



కాజ్‌వేపై నిలిచిపోయిన వాహనాలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి ఆదివారం వేలాది మంది భక్తులు భారీసంఖ్యలో వాహనాల్లో తరలిరావడంతో గ్రామంలో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది వాహనాల్లో భక్తులు తరలివచ్చారు. భక్తుల వాహనాలతో ఆలయ పరిసరాలతోపాటు పెనుగంచిప్రోలు రోడ్లన్నీ నిండిపోయాయి. పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి ఆలయం వరకు, చెరువుకట్ట, డౌన్ సెంటర్, మునేరు కాజ్‌వే నాలుగు రోడ్లు వాహనాలు నిలిచిపోవటంతో ట్రాఫిక్ నియంత్రించేందుకు గంటల సమయం పట్టింది. పోలీసులతోపాటు వాహనదారులు కూడా ట్రాఫిక్ నియంత్రణలో పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ట్రాఫిక్ కొనసాగింది. ముఖ్యంగా ఆది, శుక్రవారాలు, సెలవుదినాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలి వస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఆలయ, పోలీసు అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

1,100 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు

తిరువూరు: తిరువూరు నాగార్జున స్కూల్ ఆవరణలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం మధుమేహ రోగులకు వైద్యశిబిరం నిర్వహించారు. రక్తపోటు, మూర్ఛవ్యాధి, మధుమేహంతో దీర్ఘకాలంగా బాధపడే రోగులకు వైద్య పరీక్షలు చేశారు. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి రోగులు విచ్చేశారు.

మందులపై ఆధారపడకుండా ఆహార నియంత్రణ పాటిస్తూ, వ్యాయామం, ఉదయపు నడకతో రక్తపోటు, మధుమేహం అదుపు చేసుకోవచ్చని వైద్యులు సూచించారు. భోజనం ఒకపూట మాత్రమే తీసుకుని, రెండో పూట తృణధాన్యాలు స్వీకరిస్తే వ్యాధుల నియంత్రణ సాధ్యమవుతుందని తెలిపారు. శిబిరంలో 1100 మంది రోగులను డాక్టర్ రాజేశ్వరి, రామకోటేశ్వరరావు, రవీంద్ర పరీక్షించారు. జనవిజ్ఞాన వేదిక, జాతీయ సేవా పథకం వలంటీర్లు శిబిర నిర్వహణకు సహకరించారు.


ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫాదర్స్‌డేను పురస్కరించుకుని ఆదివారం రూట్స్ హెల్త్ ఫౌండేషన్, సోమలరాజ ఫౌండేషన్ (బెంగళూరు) ఆధ్వర్యంలో హెచ్‌సీజీ క్యూరీ క్యాన్సర్ సెంటర్ సహకారంతో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అశోక్‌నగర్‌లోని సోమనాథ్ హాస్పిటల్‌లో నిర్వహించిన ఈ శిబిరంలో 45 ఏళ్లు నిండిన తల్లిదండ్రులకు పలు రకాల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, ప్రొస్టేట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన సిద్ధార్థ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.రూప్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఖరీదైన క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా చేస్తూ ఎంతో మందికి ఉపయోగపడుతున్న రూట్స్ సంస్థకు అభినందనలు తెలిపారు. సంస్థ చైర్మన్ డాక్టర్ పోలవరపు విజయభాస్కర్ మాట్లాడుతూ.. పురుషుల్లో వచ్చే ప్రొస్టేట్ క్యాన్సర్, మహిళల్లో వచ్చే సర్వైకల్ క్యాన్సర్‌లను పీఎస్‌ఏ, పాప్‌స్మియర్ పరీక్ష ద్వారా ముందుగా గుర్తించవచ్చునన్నారు. కార్యక్రమంలో క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ కె. రంగనాథ్, డాక్టర్ విజయేశ్వరి క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఫాదర్స్ డే సందర్భంగా సీనియర్ సభ్యులైన ఎంఎస్‌ఆర్‌ఏ శర్మ, జి.నాగేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. శిబిరంలో 110 మందికి పీఎస్‌ఏ, పాప్‌స్మియర్, బీఎండీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రూట్స్ సభ్యులు శ్రీనివాస్, జి.వెంకట రమణ, విజయలక్ష్మి, శ్రావణ్, కామేశ్వరి పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం



నందిగామ: స్థానిక చెరువు బజార్‌లోని సాయిబాబా మందిర 23వ వార్షికోత్సవం ఆదివారంతో ఘనంగా ముగిశాయి. మూడు రోజులపాటు జరిగిన వేడుకలలో భాగంగా చివరి రోజు స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. పూర్ణాహుతి నిర్వహించడంతోపాటు భక్తులకు అన్నదానం చేశారు. ఆయా పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హక్కుల వేలం తేదీ మార్పు

నందిగామ: స్థానిక సత్యమ్మ అమ్మవారి ఆలయం వద్ద కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు కోసం ఈనెల 18వ తేదీ మంగళవారం నిర్వహించాల్సిన వేలం బుధవారానికి వాయిదా పడినట్లు ఆలయ ఈవో పి.సీతారామయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఈ మార్పును గమనించాలని ఆయన కోరారు.

అనాథ బాలలకు అన్నదానం

తిరువూరు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని ఐడియాస్ సేవా సంస్థలో అనాథ బాలలకు పలువురు దాతలు ఆదివారం అన్నదానం చేశారు. భగత్‌సింగ్ కాలనీకి చెందిన గోలి లక్ష్మణయ్య, హనుమాన్‌జంక్షన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ సురేష్ తదితరులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారని సంస్థ డైరెక్టర్ అవ్వారి శౌరి తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కంచికచర్ల : రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండటం ద్వారా ఆయా కేసుల నుంచి విముక్తి పొందాలని కంచికచర్ల ఎస్‌ఐ-2 హైమావతి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ హైమావతి మాట్లాడుతూ రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా కొనసాగుతుందన్నారు. రౌడీషీటర్లు స్టేషన్ పరిధిలోనే ఉండాలన్నారు. అప్పుడప్పుడు స్టేషన్‌లో సంతకాలు చేయాల్సి ఉంటుందన్నారు. రౌడీషీటర్లు, సస్పెక్టెడ్ కేసులున్న వారి కదలికలపై అనుమానం వస్తే వెంటనే వారిని అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తామని తెలిపారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే రౌడీషీటర్లను జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

పూర్ణాహుతితో ముగిసిన బ్రహ్మోత్సవాలు



కల్యాణోత్సవాన్ని వీక్షిస్తున్న ఉభయ దాతలు, భక్తులు



శాంతి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



ఆలయ ప్రధాన కలశాలకు అభిషేకాలు



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

కనులపండువగా కల్యాణోత్సవం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో గత మూడు రోజులుగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ఆదివారం ఉదయం పూర్ణాహుతి కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు లాంఛనంగా ముగిశాయి. ఉదయం 8 గంటలకు ప్రధాన దేవతామూర్తులకు అనుష్టానం, పారాయణలు, హోమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారి ఆలయంతో పాటు ఇతర ఉపాలయాల కలశ స్థాపన, అభిషేకాలను ఆలయ అర్చకుడు పవన్ కుమార్ శర్మచే జరిపించారు.

అన్న ప్రసాద వితరణ

ఆలయ ప్రాంగణంలో వాసురెడ్డి వెంకటేశ్వరరావు, శేషారత్నం దంపతులచే శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వార్ల శాంతి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మల పర్యవేక్షణలో అర్చకులు ఉత్సవ మూర్తులకు కల్యాణోత్సవాన్ని జరిపించారు. పలువురు ఉభయ దాతలు, భక్తులు స్వామి వారి కల్యాణోత్సవాన్ని వీక్షించి మంత్రముగ్ధులయ్యారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు స్వామి వారి అన్న ప్రసాద వితరణ చేశారు. అల్లూరి గౌరీనాథ్ దంపతులచే ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు విశేషంగా తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కంచికచర్ల : అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు, తరలింపునకు పాల్పడేవారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ పెంకె వెంకట సత్య సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మండలంలోని మోగులూరు మున్నేటి నుంచి ఆదివారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అక్రమంగా ఇసుకను తరలించే వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. ఇసుక ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించడంతోపాటు వాహన యజమాని, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.